షాద్‌నగర్‌లో సదరం ఏర్పాటుకు కృషి

ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌టౌన్, నవంబర్ 9: షాద్‌నగర్‌లో దివ్యాంగుల సదరం క్యాంపును ఏర్పాటు చేసేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ దవాఖానలో శనివారం మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి దవాఖాన డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు, వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ల కోసం ఇక్కడి నుంచి దూర ప్రాంతాలకు వెళ్తూ ఇబ్బందులు పడుతున్నారని, దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా షాద్‌నగర్‌లో సదరం క్యాంపు నిర్వహించేలా కృషి చేస్తానని వివరించారు. అదే విధంగా దవాఖానలోని వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులతో ఆపాయ్యంగా మాట్లాడాలన్నారు. దవాఖానలో ప్రసవాల సంఖ్యను పెంచాలని, ప్రసవాల కోసం ఇతర దవాఖానలకు రెఫర్ చేయడం తగ్గించాలన్నారు. నర్సింగ్ సిబ్బంది కొరతను తీర్చడానికి తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు, అధికారులు చంద్రశేఖర్, మాధవి దేవి, నర్సింహులు, సందీప్, లక్ష్మణ్, మహ్మద్ అలీఖాన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు తీరును పరిశీలిస్తున్న ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి

ఆమనగల్లులో బీఎల్వోతో మాట్లాడుతున్న కల్వకుర్తి ఆర్డీవో శ్రీనూనాయక్

యువత ఓటు హక్కును నమోదు చేసుకోవాలి

తుర్కయాంజాల్, నవంబర్ 9 : 18 ఏళ్లు నిండిన యువత ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి అన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం -2025లో భాగంగా శనివారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి ఉమర్‌ఖాన్‌గూడలో నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంపెయిన్ ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 9, 10 తేదీల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంపెయిన్‌లో 18ఏళ్లు నిండిన యువత ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు. స్థానిక బూత్ లెవల్ అధికారిని సంప్రదించి ఫారం-6 దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి రాగన్నగూడలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ పరిశీలించారు.

తప్పులేని ఓటరు జాబితా సిద్ధం చేయాలి

ఆమనగల్లు : ఓటరు జాబితాలో తప్పులు లేకుండా పేర్లు నమోదు చేయాలని బీఎల్వోలకు కల్వకుర్తి ఆర్డీవో శ్రీనూనాయక్ సూచించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యాక్రమం-2025లో భాగంగా శనివారం ఆర్డీవో శ్రీనూనాయక్ శంకర్‌కొండతండా, సామాయిపల్లి తండా, మేడిగడ్డతండా, ఆమనగల్లు మున్సిపాలిటీలోని 190,193,194 పోలింగ్ బూత్‌ల్లో ఓటరు నమోదు కార్యాక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో శ్రీనునాయక్ మాట్లాడుతూ 1 జనవరి , 2025 నాటికి 18 ఏళ్లు నిండిన యువతి యువకులు ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. నూతన ఓటరు నమోదుకు ఫారం-6, అభ్యంతరాల కోసం ఫారం-7, సవరణలకు ఫారం-8తో దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పరిశీలించి తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ లలిత, ఆర్ఐ చెన్నకేశవులు రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

షాద్‌నగర్, నవంబర్9: తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య రంగారెడ్డి జిల్లా నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కేశంపేట మండలం ఖైర్‌ఖాన్‌పల్లి గ్రామానికి చెందిన యాదగిరిరావు, ముఖ్య సలహాదారులుగా షాద్‌నగర్ పట్టణానికి చెందిన టీవీ రంగయ్య, అధ్యక్షుడిగా ఖైర్ఖాన్‌పల్లి గ్రామానికి చెందిన గన్నోజు యాదగిరిచారి, ప్రధాన కార్యదర్శిగా ఫరూఖ్‌నగర్ మండలం చించోడు గ్రామానికి చెందిన రమేశ్‌చారి, ఉపాధ్యాక్షులుగా బాలరాజు, రవికుమార్, సూర్యప్రకాశ్, కోశాధికారిగా ద్రోణాచారి, శంకరయ్య, సహాయ కార్యదర్శులుగా వీఆర్‌కే మూర్తి, గోపాల్‌రెడ్డి, ఆంజనేయులుయాదవ్‌లతో పలువురు కళాకారులు సభ్యులుగా ఎన్నికయ్యారు. జిల్లా నాటక రంగాన్ని తమవంతుగా అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష

దీక్షలో కూర్చున్న గిరిజన నాయకులు

కడ్తాల్, నవంబర్ 9: తమ గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ, గట్టుఇప్పలపల్లి గ్రామస్తులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం తొమ్మిదవ దీక్షలో గిరిజన నాయకులు రమేశ్‌నాయక్, మోత్యానాయక్, శేషనాయక్, హనుమంతు, రామ్‌సింగ్, భాస్కర్, రాజు, కిషోర్, బాలు అమర్‌సింగ్ కూర్చున్నారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ శరత్‌చంద్ర, నాయకులు రమేశ్, నవీన్‌కుమార్, అనిల్ ఉన్నారు.

దళారులకు పత్తిని విక్రయించొద్దు

షాద్‌నగర్‌రూరల్, నవంబర్ 9 : పత్తి రైతులు దళారుల చేతిలో మోసపోవద్దని, సీసీఐ కొనుగోలు కేంద్రాల వద్ద విక్రయించాలంటూ షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్ పత్తిరైతులను కోరారు. షాద్‌నగర్ మార్కెట్ పరిధిలో 11 పత్తి మిల్లుల్లో సీసీఐ ద్వారా పత్తిని కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7521(తేమ 8శాతం లోపు ఉన్నట్లయితే) చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. తేమ 9శాతం ఉన్నట్లుయితే కనీస మద్దతు ధర 1శాతం తగ్గించి రూ.7445.79లు చెల్లించన్నునట్లు తెలిపారు. తేమ 12శాతం కంటే ఎక్కువ ఉన్నట్లుయితే సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేయడం జరుగదని సూచించారు. మండలంలోని చిలకమర్రి గ్రామంలోని రాఘవేంద్ర కాటన్ కార్పొరేషన్, దోడియా అగ్రో ఇండ్రస్టీస్, సోలిపూర్ గ్రామంలోని గౌరవ మిల్లు, కేశంపేట రోడ్డులో గాయత్రి ట్రేడింగ్ కంపెనీ, నందిగామలోని తిరుమల ట్రేడింగ్ కంపెనీ, హరిహర జిన్నింగ్ మిల్లు, తుల్జాభవానీ కాటెక్స్, వినాయక కాటన్‌మిల్స్, ఎలికట్ట గ్రామంలోని శ్యామ్ కాటెక్స్ ఇండియాప్రైవేట్ లిమిటెడ్, కొందుర్గ మండలంలోని శ్రీనివాస్ కాటన్ మిల్లు, సూపర్ కాటన్ మిల్లులో సీసీఐ ద్వారా కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. రైతులు ఆధార్‌కార్డు, పట్టా పాస్‌బుక్ జిరాక్స్ తీసుకెళ్లాలన్నారు. మరింత సమాచారం కోసం 8897281111 నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రోగాల నివారణకు టీకాలు వేయించాలి

ఇబ్రహీంపట్నంరూరల్, నవంబర్ 9 : రోగాల నివారణకు ఆవులు, గేదెలు, దూడలకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని పశువైద్యాధికారి ఆనంద్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తుర్కగూడ గ్రామంలో శనివారం ఆయన ఆవులు, గేదెలకు పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం ప్రతిఏటా ఉచితంగా అందజేస్తున్న వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గోపాల మిత్రుడు జగన్ తదితరులున్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

షాబాద్, నవంబర్ 9: మండల పరిధిలోని చర్లగూడ గ్రామంలో చేవెళ్లకు చెందిన పీఎంఆర్ మెడికల్ దవాఖాన ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో మొత్తం 350 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ శిబిరానికి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కౌకుంట్ల రాజేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో దవాఖాన సీఎస్ఆర్ హెడ్ సురేఖ, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, గ్రామస్తులు ఆంజనేయులు, సత్యనారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి, యాదయ్య, రాములు, వంశీ, బాలమణి పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి

ఇబ్రహీంపట్నంరూరల్, నవంబర్ 9 : విద్యార్థులు కష్టపడి క్రమశిక్షణతో చదువుకోవాలని హైదరాబాద్ ప్రభుత్వ హోమియో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, గురునానక్ విద్యాసంస్థల వైస్‌చైర్మన్ గగన్‌దీప్‌సింగ్ కోహ్లీ అన్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ విద్యాసంస్థల్లో శనివారం ఓరియంటేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిజాయతీతో వైద్యవిద్యను అభ్యసించి భవిష్యత్‌లో వైద్య రంగంలో రాణించాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు అలోపతి మందులు ఆర్థిక భారం వల్ల కొనలేక పోతున్నారని దానికి ప్రత్యామ్నాయంగా హోమియో మందులు వాడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో ప్రఖ్యాత షుగర్ వ్యాధి నిపుణులు అవిష్ చహాన్, పిజియోథెరపీ రాజేశ్‌రెడ్డి, యశోద దవాఖాన విద్యార్థులతో పాటు కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ సైనీ, యూనివర్సిటీ రిజిస్ట్రార్ శ్రీనివాసులు, శ్రీనాథ్‌రెడ్డి, సంజీవ్, శ్రీవాస్తవ, పార్థసారథి, రేణుక, అపర్ణ, పాండా తదితరులున్నారు.

జాబితాను తప్పుల్లేకుండా సవరించాలి

మొయినాబాద్, నవంబర్ 9: ఓటరు జాబితాలో ఎలాంటి తప్పుల్లేకుండా తయారు చేయాలని చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ అన్నారు. రెండు రోజుల పాటు ఓటరు జాబితా సవరణ అధికారులు నిర్వంచడంతో పాటు ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమాన్ని శనివారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామంలో నిర్వహిస్తుండగా మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓటరు జాబితాను స్పెషల్ డ్రైవ్ అధికారులు ఎలా చేపడుతున్నారని పరిశీలించారు.

మార్కెట్ యార్డులో కోల్డ్ స్టోరేజీ నిర్మిస్తాం

చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు

చేవెళ్ల, నవంబర్ 9 : వ్యవసాయ మార్కెట్ కార్యాలయ అభివృద్ధికి కృషి చేస్తామని చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు అన్నారు. శనివారం చేవెళ్ల మండల కేంద్రంలోని కార్యాలయంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గంతో మీటింగ్ నిర్వహించారు. ఇందులో మార్కెట్ యార్డులో కోల్డ్ స్టోరేజీ, పది షాపుల నిర్మాణం, సీసీ రోడ్ల ఏర్పాటు, రైతుబజార్‌కు కాంపౌండ్ వాల్, మార్కెట్ కార్యాలయం, యార్డులో సీసీ కెమెరాల ఏర్పాటు, రైతులకు కూరగాయల కవర్‌షెడ్ నిర్మాణం తదితర పనుల కోసం తీర్మానం చేసి న ట్లు వివరించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు మల్లేశ్, సత్యనారాయణ, సుదర్శన్, యాదిరెడ్డి, లలిత, బాలయ్య, నరేందర్, హనీఫ్, యాదయ్య, జనార్దన్, వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు

సదర్ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

వేడుక ఆహ్వాన పత్రిక ఆవిష్కరించిన యాదవ సంఘం సభ్యులు

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్ 9 : అఖిల భారత యాదవ మహాసభ అబ్దుల్లాపూర్‌మెట్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు మండల కేంద్రంలో నిర్వహించే సదర్ వేడుకను విజయవంతం చేయాలని యాదవ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. సదర్ వేడుక ఆహ్వాన పత్రికను శనివారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ వేడుకకు ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, బీర్ల ఐలయ్య, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎంపీలు కిరణ్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, అంజయ్య యాదవ్, జైపాల్ యాదవ్, బొల్లం మల్లయ్య యాదవ్, నోముల భగత్, నాయకులు క్యామ మల్లేశ్, తోటకూర జంగయ్య, అందెల శ్రీరాములు, నవీన్‌యాదవ్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, బాల్‌రాజ్, జానయ్య, సురేందర్, ఈశ్వరమ్మ, రమేష్‌యాదవ్, అజయ్‌కుమార్, మధుసూదన్‌రెడ్డితో పాటు పలువురు మండల, గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొంటారని వారు తెలిపారు. కార్యక్రమంలో యాదవ సంఘం మండల అధ్యక్షుడు శంకరయ్య, నాయకులు వీరస్వామియాదవ్, రాధాకృష్ణ, శ్రీశైలం, వెంకటేశ్, జంగయ్యయాదవ్, జంగమయ్యయాదవ్, భాను, అశోక్, వంశీ పాల్గొన్నారు.

సదర్ వేడుకల ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న యాదవ సంఘం సభ్యులు

ఘనంగా అయ్యప్ప

పడిపూజ

చేవెళ్లటౌన్, నవంబర్ 9: కార్తిక మాస రెండవ శనివారం పురస్కరించుకొని మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప పడి పూజను స్వాములు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. కార్యక్రమంలో దేవాలయ ప్రధాన అర్చకులు కిరణ్‌కుమార్, అయ్యప్ప గురు స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

కార్యవర్గాన్ని సన్మానిస్తున్న డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

సమస్యల పరిష్కారానికి కృషి

కడ్తాల్, నవంబర్ 9: హమాలీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల హమాలీ సంఘం నూతన కార్యవర్గాన్ని ఇటీవల ఎన్నుకున్నారు. శనివారం మండల కేంద్రంలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, హమాలీ సంఘం సభ్యులను స్థానిక నాయకులతో కలిసి ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని హమాలీలకు అండగా ఉంటానని తెలిపారు. ప్రతి హమాలీకి బీమా చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మా నాయక్, మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు శ్రీను, భిక్షపతి, కృష్ణ, రవి, శ్రీకాంత్, రాజేశ్, రమేశ్, మహేశ్, సత్యం, వెంకటేశ్, హమాలీ సంఘం అధ్యక్షుడు రమేశ్, ఉపాధ్యక్షుడు కృష్ణయ్య, జనార్ధన్, జంగయ్య, కోశాధికారి వెంకటేశ్, సహాయ కార్యదర్శులు రమేశ్, మల్లేశ్, పెంటయ్య, లింగయ్య, కృష్ణ పాల్గొన్నారు.

రుణమాఫీ పకడ్బందీగా అమలు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రంగారెడ్డిజిల్లా కార్యదర్శి జంగయ్య

సీపీఐ రంగారెడ్డిజిల్లా కార్యదర్శి జంగయ్య

షాబాద్, నవంబర్ 9: రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, రైతు రుణమాఫీని పకడ్బందీగా చేసి రైతులను ఆదుకోవాలని సీపీఐ రంగారెడ్డిజిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం షాబాద్ మండల కేంద్రంలో సీపీఐ మండల సమితి సమావేశం పార్టీ మండల కార్యదర్శి జంగయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జంగయ్య మాట్లాడుతూ... ఎన్నికలకు ముందే రైతుల రుణాలను ఎలాంటి షరతులు లేకుండా రుణాలను మాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం రుణమాఫీ హామీని అమలు చేయడం లేదని మండిపడ్డారు. నిరుపేదలకు ఇందిరమ్మ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను నిర్మించి, స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షల సాయం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని, విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె. రామస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య, పార్టీ నాయకులు రఘురాం, నారాయణ, మధు, రుక్కయ్య, శ్రీశైలం, నర్సయ్య, రాములు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కడ్తాల్, నవంబర్ 9: ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరిని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ తరపున ఆదుకుంటామని ట్రస్ట్ అధినేత, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ అన్నారు. తలకొండపల్లి మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మమ్మ అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న వెంకటేశ్ శనివారం బాధిత కుటుంబానికి ట్రస్ట్ తరపున రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, శ్రీశైలంయాదవ్, ఆంజనేయులు, జంగయ్య, శ్రీను, వెంకటేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

చరణ్ (ఫైల్)

యాచారం, నవంబర్ 9 : లిఫ్ట్ అడిగి బైకుపై స్వగ్రామానికి వస్తున్న ఓ బాలుడిని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. బైక్‌ను కారు ఢీకొట్టగా బాలుడు అక్కడిక్కడే మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన యాచారం ఠాణా పరిధిలోని తమ్మలోనిగూడ గేటు వద్ద శనివారం నాగార్జునసాగర్ రహదారిపై జరిగింది. యాచారం సీఐ నరసింహరావు కథనం ప్రకారం.. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కొనిరెడ్డి యాదయ్య కుమారుడు చరణ్ (16) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. మాల్‌లో ఉంటున్న తన తండ్రి దగ్గరకు వెళ్లాడు. తిరిగి స్వగ్రామం వచ్చేందుకు మాల్‌లో తక్కళ్లపల్లిగేటు వద్ద దిగేందుకు మండలంలోని చింతపట్ల గ్రామానికి చెందిన రవి (35) అనే వ్యక్తి బైక్‌ను ఆపి ఎక్కాడు. సరిగ్గా తమ్మలోనిగూడ గేటు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న బెంజ్ కారు అతి వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో చరణ్ అక్కడిక్కడే మృతి చెందగా, రవికి తీవ్రగాయాలయ్యాయి. అతడ్ని మాల్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చరణ్ మృతితో కొత్తపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

నృత్య ప్రదర్శన ఇస్తున్న విద్యార్థిని

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్ 9 : చదువుతోనే ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని విశ్రాంత చీఫ్ సివిల్ ఇంజినీర్ డాక్టర్ ఎన్.నాగభూషణ రావు అన్నారు. శనివారం షాబాద్ మండలంలోని సోలీపేట్, మద్దూర్, నాగరకుంట, ముద్దెంగూడ, కేశవగూడ గ్రామాల్లో ఎన్యుమరేటర్స్ చేస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇంటింటి సర్వేలో వివరాలన్ని పకడ్బందీగా సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

పొరపాట్లకు తావివ్వొద్దు

పెద్దఅంబర్‌పేట : మున్సిపాలిటీలో సమగ్ర కుటుంబ సర్వే శనివారం ప్రారంభమైంది. మున్సిపాలిటీని 177 ఎన్యుమరేషన్ బ్లాకులుగా విభజించి, 26 వేల కుటుంబాలు ఉన్నట్టు గుర్తించారు. ఈ మేరకు ఆయా ఎన్యుమరేషన్ బ్లాకుల్లో ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారం బ్రిజిన్యాలీలో సర్వేను కమిషనర్ రవీందర్‌రెడ్డి పరిశీలించారు. సర్వే పకడ్బందీగా చేయాలని సూచనలు చేశారు. ఎక్కడా పొరపాట్లకు తావివ్వొద్దని చెప్పారు.

చెత్తలో మంటలు..

మహిళ మృతి

పెద్దఅంబర్‌పేట, నవంబర్ 9 : చెత్త కుప్పలో మంటలు చెలరేగి ప్రమాదవశాత్తు ఓ చెత్త ఏరుకునే మహిళ మృతి చెందింది. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ ఠాణా పరిధిలో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హయత్‌నగర్‌లోని రంగనాయకులగుట్ట ప్రాంతానికి చెందిన బుగ్గ లలిత (45) చెత్త ఏరుకుంటూ జీవిస్తున్నది. వీధుల్లోని చెత్తను సేకరించి.. అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామంలో చెత్త కుప్పల వద్ద పోస్తారు. అక్కడ కరెంటు, కేబుల్ తీగలు, టైర్లు, లోపల రాగి కలిగిన ఇతర వస్తువులను తగలబెట్టి.. ఆపై వచ్చిన రాగిని అమ్ముకుని సొమ్ము చేసుకుంటారు. ఎప్పటిలాగే శనివారం కూడా చెత్త ఏరుకుని ఓ చోట డంప్ చేశారు. కాపర్ కోసం వైర్లు, ఇతర వస్తువులను తగలబెట్టారు. ఆపై మిగిలిపోయిన చెత్తను తగలబెట్టేందు కు పెట్రోల్ పోసినట్టు తెలుస్తున్నది. ఈ క్రమంలో మంటలు పెద్దఎత్తున చెలరేగా యి. ప్రమాదవశాత్తు లలితకు మంటలు అంటుకున్నాయి. ఆ పక్కనే ఉన్న చెత్త ఏరుకునే కైసర్‌బాషా ఆమెను కాపాడే ప్రయత్నం చేసినా అది ఫలించలేదు. అప్పటికే మంటలు ఎక్కువై ఆమె అక్కడికక్కడే కాలిపోయి మృతిచెందింది. బాషాకు గాయాలయ్యాయి. ప్రమాద విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రారంభమైన సమగ్ర కుటుంబ సర్వే

ఇన్ముల్‌నర్వలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న మండల అధికారులు

కొత్తూరు, నవంబర్ 9: మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో సమగ్ర కుటుంబ సర్వే శనివారం ప్రారంభమయింది. ఈ సర్వే కోసం ఆరుగురు పర్యవేక్షకులు, 55 మంది ఎన్యుమరేటర్లను ప్రభుత్వం నియమించింది. ఈ ఎన్యుమరేటర్లు 5815 కుటుంబాలను సర్వే చేయనుంది. కొత్తూరు మండలంలోని ఇన్ముల్‌నర్వలో నిర్వహించిన సర్వేలో ఎంపీడీవో అరుంధతి, ప్రత్యేక అధికారి లీన, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

వ్యక్తిగత సమాచారం ఇచ్చేందుకు నిరాకరిస్తున్న ప్రజలు

మండలంలో శనివారం ప్రారంభమైన కులగణన సర్వేలో ప్రజలు వ్యక్తిగత సమాచారం ఇచ్చేందుకు చాలా చోట్ల నిరాకరిస్తున్నారు. ముఖ్యంగా కులగణనలో సరైన సమాచారం ఇవ్వడంలేదు. అప్పులు, ఆదాయం, భూమి, ఇళ్లు, వగైరా ప్రశ్నలకు సమాచారం ఇచ్చేందుకు ఆసక్తి చూపడంలేదు. ఇక చేసేది లేక ఇన్యుమరేటర్లు ఇంటి యజమాని ఇచ్చిన సమాచారాన్ని రాసుకుంటున్నారు.

తండాల్లో సమగ్ర కుటుంబ సర్వే

కడ్తాల్ : మండల కేంద్రంతోపాటు పరిధిలోని గ్రామాలు, తండాల్లో సమగ్ర కుటుంబ సర్వేను అధికారులు ప్రారంభించారు. సర్వేలో తహసీల్దార్ ముంతాజ్, ఎంపీడీవో సుజాత పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు ఇంటింటికీ వెళ్లి వివరాలను నమోదు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, బిచ్చానాయక్, హన్మానాయక్, వెంకటేశ్, భీక్యానాయక్, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేకు సహకరించాలి

ఆమనగల్లు : మండలంలోని 13 గ్రామపంచాయతీలు, ఆమనగల్లు మున్సిపాలిట